# పునరావృతం

- సుసర్ల సుధ

"అత్తయ్యా! ప్రక్కింటి రాజేశ్వరమ్మగారి కోడలు గీత మిమ్మల్ని బయటకు తీసుకువెళుతుంది. పదకొండు గంటలకి వస్తుంది. రెడీగా ఉండండి'' అని తన కోడలు హిమబిందు బైక్‌మీద ఆఫీసుకు వెళ్ళిపోయింది. ఒత్తులు చేసుకుంటూ టీవీ చూస్తున్నదల్లా లేవలేక లేవలేక లేచి గేటు దగ్గరకు వచ్చి 'ఎక్కడికీ?' అని తను అడిగిన మాట గాల్లోనే కలిసిపోయింది.

ఉసూరుమంటూ అడుగులో అడుగు వేసుకుంటూ ఎలాగో ఇంట్లోకి వచ్చి పడింది సావిత్రమ్మ. క్రిందటి సంక్రాంతికి చిన్న కూతురు పెట్టిన జరీ చీర మురిపెంగా చూసుకుంది కట్టుకుందామని. చంద్రకాంతం రంగు. తనకి చాలా ఇష్టం. పుట్టినరోజు కానుకగా తన భర్త కాశ్మీర్ సిల్క్ చీర తెచ్చి ఇచ్చాడు.

"సావిత్రీ! ఈ రంగు నీ ఒంటికి బాగా నప్పుతుందోయ్'' అన్న మాటలు గుర్తు చేసుకుని కళ్లజోడు తీసి చెమర్చిన కళ్లను పైట చెంగుతో తుడుచుకుంది. 'ఎక్కడున్నారో? మతి స్థిమితం లేని కారణంగా ఎటో వెళ్లిపోయారు. ఎప్పటికైనా రాకపోతారా?' అనుకుంటూ కాలక్షేపం చేసేస్తోంది.

'ఇంకేమిటి వచ్చేది?' అని అందరూ చాటుగా అనుకున్న మాటలు పట్టించుకునేదికాదు.

"పిన్నిగారూ! రెడీయేనా?'' అన్న గీత మాటలు విని ఉలిక్కిపడి ఆలోచనా వలయాలను ఛేదించుకుంది.

"ఒక్కక్షణంలో వచ్చేస్తున్నానమ్మా'' అంటూ గబగబా తయారయింది. పెరట్లో పూచిన గులాబీలు రెండు కోసి తెచ్చి "పెట్టుకోమ్మా'' అని ఇచ్చి తనూ పెట్టుకుని ఉత్సాహంగా బయలుదేరింది.

ఎప్పటినుండో కొడుకునీ, కోడల్నీ అడుగుతూ వస్తోంది. 'అన్నమయ్య' సినిమా సెకండ్ రిలీజ్ వచ్చింది, చూపించండి ఈసారైనా. నేత్రపర్వంగా పెద్ద తెరమీద చూసి తరిస్తాను' అంది.

ఇద్దరికీ ఆఫీసేనాయె. కొడుక్కైతే క్యాంపులతో అసలు కంటిచూపుకి అందకుండా ఉన్నాడు. అందుకే గీతకి పురమాయించిందేమో తీసుకువెళ్లమని. ఒకవేళ ఏ లలితాదేవి కోవెలకో, కనక మహాలక్ష్మి కోవెలకో తీసుకువెళ్తోందో ఏమో? పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు ఏమీ లేకుండా హడావుడిగా బయల్దేరడమవుతోంది. ఎందుకింతగా ఆలోచించడం? అడిగేస్తే సరి! అని "ఇంతకూ ఎక్కడికమ్మా మనం వెళ్లేది?'' అంది.

ఆటో దిగి సావిత్రమ్మగారి రెక్క పుచ్చుకుని జాగ్రత్తగా దింపుతూ "తినబోతు రుచులెందుకు? వెళ్లాక మీకే తెలుస్తుంది'' అని సావిత్రమ్మగారి చెయ్యి పట్టుకుని ముందుకు దారి తీసింది గీత.

ఎదురుగా కనిపించిన బోర్డు మీది అక్షరాలు చదువుదామని ఎంత ప్రయత్నించినప్పటికీ పవర్ తగ్గిపోయిన కళ్లజోడువల్ల ఫలితం లేకపోయింది. తనని ఓ కుర్చీలో కూర్చోమని చెప్పి లోపలకు వెళ్లింది గీత. గంట తరువాత వచ్చి ఒక అమ్మాయిని, అబ్బాయిని చూపించి "తను లక్ష్మి. మీకేం కావాల్సినా చేస్తుంది. ఇతను రాఘవ అని ఇక్కడ క్లర్కు. మీ అబ్బాయి ఆఫీసులో పని చేసే ఆయన తమ్ముడు. మిగిలిన విషయాలు వారే మాట్లాడతారు. నేను వెళ్లాలండీ. మావారు లంచ్‌కి వస్తారు. అన్నట్లు మీకు చెప్పనేలేదుకదూ. ఇది ఓల్డ్ ఏజ్ హోమ్'' అని ఆటో ఎక్కి వెళ్లిపోయింది.

ఆ ఆటో వెళ్లింది రోడ్డుమీద నుంచి కాదు, తన గుండెలమీద నుండి. నిలువునా మ్రాన్పడిపోయింది. ఎంత దారుణం? తనకి మాటమాత్రమైనా చెప్పలేదు. తన కొడుకు ఇంట్లో లేకుండా చూసి తనను ఇందులో చేర్పిస్తుందా? ఎంత సాహసం? తన కొడుకు వచ్చాక ఇంటికి తీసుకువెళ్లకుండా ఉంటాడా? చూద్దాం అనుకుంటూ తనకి చూపించిన గదిలోకి వెళ్లిపోయింది.

అక్కడ టేబుల్‌మీద రెండు మూడురకాల పళ్లతో బుట్ట ఒకటి, తన కొడుకు ఢిల్లీ నుండి తెచ్చిచ్చిన ఎర్ర బ్యాగ్ ఒకటి కనిపించాయి. తన బట్టలూ అవీ రహస్యంగా సర్ది ముందే పంపించివేసిందన్నమాట. అవును మరి ముందే చెబితే తను వచ్చేదా? అలా ఆలోచిస్తూ నడుం వాల్చింది.

★★★

మర్నాడు సాయంత్రం కోడలు హిమబిందు, రాజేశ్వరమ్మగారిని వెంటబెట్టుకుని వచ్చింది. పలకరిస్తే పొడిపొడిగా మాట్లాడి ముభావంగా ఉండిపోయింది.

"మీకిక్కడ ఏం లోటు ఉండదత్తయ్యా. అన్నీ వాళ్లే చూసుకుంటారు. మేమూ పిల్లల్ని తీసుకుని అప్పుడప్పుడు వస్తూనే వుంటాము'' అని ఎవర్నో కలవాలంటూ బైటికెళ్లిపోయింది.

తనేదైనా మాట్లాడితే ఒకటికి పదేసి వాడితో చెబుతుంది. ఆ మాట పట్టుకుని వాడు తనని నిలేస్తాడు. అదీగాక కూడా పరాయి వాళ్లని వెంటేసుకుని వచ్చింది తెలివిగా ఆవిడ ఎదురుగా తనేమీ అనదనే ధైర్యంతో. తన కొడుకుతో చెప్పుకుంటుంది, ఎందుకిలా చేసావని అడుగుతుంది.

"సావిత్రమ్మా! ఇక్కడ నీకు బాగానే వుందా?'' అన్న మాటలకి ఉలిక్కిపడింది.

"ఆ...ఆ... చూసావా వదినా నా పరిస్థితి? నన్నొక వస్తువును చేసారు. చెప్పా పెట్టకుండా తీసుకువచ్చి ఈ నరకంలో పడేసారు'' అని తన గోడంతా వెళ్లబోసుకుంది.

"మరీ విడ్డూరం... నీకు తెలియదా అయితే బాగుంది'' అంటూ మూతి ముప్పై వంకర్లు తిప్పింది రాజేశ్వరమ్మ.

"అయినా ఇంత బాధ పడవలసిన విషయం కాదేమోనమ్మా. మీ అత్తగారు కూడా ఏదో ఆశ్రమంలోనే ఉండేదిగా. ఇప్పుడు నీ వంతయింది. బాధ పడతావెందుకు? ఎటొచ్చీ నీ కోడలు నీకన్నా నాలుగు ఎక్కువ చదివింది. చెప్పాపెట్టకుండా చేర్పించేసింది. నీవైతే మీ ఆయనతోనూ, అత్తగారితోనూ పోట్లాట పెట్టుకుని, సత్యాగ్రహం చేసి అభో జనాలుండి చివరికి ఆవిడని ఆశ్రమంలో చేర్పిస్తేనే గానీ ఇంటికి రానని పుట్టింటికి వెళ్లిపోలేదూ? అప్పుడు దారి ఖర్చులకి డబ్బు సర్దుబాటు చేసింది నేనుగాదూ? ఆ తరువాత మీ అత్తగార్ని ఆశ్రమంలో చేర్పించి నిన్ను ఇంటికి తీసుకువచ్చాడు మీ ఆయన. ఇవన్నీ ఎవరెరుగరు? అందుచేత చెప్పేదేమిటంటే నువ్వు హాయిగా జీవితాన్ని నవ్వుతూ గడిపేయ్. బాధలతో, దిగులుతో ఆరోగ్యాన్ని పాడు చేసుకోకు. నేను నిజాన్ని నిర్భయంగా చెప్పే ముక్కుసూటి మనిషిని. నువ్వేమీ అనుకోకు'' అంది. హిమబిందు రాగానే ఇద్దరూ వెళ్లిపోయారు. తనకి నోట మాట రాలేదు. ఈవిడ తనని ఓదార్చడానికి వచ్చిందా? దెప్పిపొడవడానికి వచ్చిందా? అనుకుంది.

★★★

ఓ నాలుగు రోజుల తరువాత తన కొడుకు శంకరం, స్నేహితుడు ప్రకాశాన్ని వెంటబెట్టుకుని వచ్చాడు. తనకి కడుపులోంచి గొంతులోకి దుఃఖం వెల్లువలా ఉబికి వచ్చింది. కన్నీళ్లాపుకోలేకపోయింది. కొడుకు చేతులు తన చేతుల్లోకి తీసుకుని

తనివితీరా ఏడ్చేసింది.

"ఏమిటమ్మా ఇది? ఇప్పుడేం కొంప మునిగిందని? నిన్నేం అడవుల మధ్య ఉండమంటున్నామా? ఇక్కడ ఉండేది మనుష్యులే. ముందుగా చెబితే నువ్వు ఓ పట్టాన ఒప్పుకోవని ఇలా చేసాం" అన్నాడు అనునయంగా.

చివ్వున తలెత్తి "నీకు ముందే తెలుసా?" అంది ఆశ్చర్యంగా.

ఆ మాటలు విన్న ప్రకాశం 'పాపం...ఈవిడకేం తెల్సు? ఈ విషయం తెల్సి శంకరం భార్యతో ఎంత గొడవ పడ్డాడో' అనుకున్నాడు తనలో.

"అన్నట్లు ఇదిగో నీకిష్టమైన నవలలు, భగవద్గీత, లలిత, విష్ణు సహస్రనామ పారాయణాలున్న పుస్తకాలు. నిశ్చింతగా ఉండు. నీ వయస్సువాళ్లతో కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేయి. సాయంత్రం స్కూలు నుంచి నేరుగా ఇక్కడికే వస్తాడు నీ మనవడు. ఉంటాను" అని చెప్పి ప్రకాశంతో వెళ్లిపోయాడు శంకరం.

'హూ... నిశ్చింతగా ఉండాలిట. ఎంత తేలిగ్గా అనేసాడు ఆ మాట. అవునులే. తనకీ శాస్తి జరగాల్సిందే. పెళ్లయిన ఏడాదిలోపుగానే తన అత్తగార్ని తనూ ఆశ్రమంలో చేర్పించేయలేదూ' అనుకుంది.

"అమ్మాయ్ సావిత్రీ! నా కొడుక్కి నన్ను దూరం చేయకమ్మా. వాడిని వదిలి నేను ఒక్క క్షణమైనా ఉండలేను. ఒక్కగానొక్క నలుసు. లేకలేక పుట్టాడు. ఎన్నో నోములు, వ్రతాలు చేయగా పుట్టిన వంశోద్ధారకుడని మరిసిపోయాం. ఆ ఆనందాన్ని నా ప్రాణం ఉన్నంతవరకూ అనుభవించనీయ్" అని తన చేతులు పట్టుకుని ఆవిడ ఎంత ప్రాధేయపడినా తన కఠిన హృదయం కరిగిందా? పండుగలకీ, పుట్టినరోజులకీ తన తల్లిని ప్రక్కన కూర్చోబెట్టుకుని పిండి వంటలతో భోజనం పెట్టలేకపోయానే అని తన భర్త ఎంతగా విలపించాడు?

కొడుకు కోడలితో, మనవలతో ఆనందంగా గడిపేయాలనుకున్న ఆవిడ గతి ఏమయ్యింది? చివరి దశలో అయిన వాళ్లందరూ ఉండి అనాథగా వెళ్లిపోయింది. ప్రస్తుతం తనూ అదే పరిస్థితిలో ఉంది. ఇకపై ముందు తరాలవారంతా ఇలాగే ప్రవర్తిస్తారా? ఏమో...చివరికి తన భవిష్యత్తు ఎలా గడుస్తుందో ఏమిటో? ...ఇలా ఆలోచిస్తూ ఉండిపోయింది.

★★★

"నాన్నమ్మా!" అంటూ మీద వాలిపోయిన మనవడిని లాలిస్తూ-

"నా తండ్రీ... నా నాయనే... నానమ్మను చూడడానికి వచ్చావా" అంది తల నిమురుతూ.

"చూసావా! మీ నానమ్మను ఇక్కడికి ఎలా తెచ్చి పడేసారో మీ అమ్మానాన్న. నలుగురిలోనూ కలసి మెలసి ఉండేదాన్ని. ఒంటరిగా బ్రతకడం చేతకానిదాన్ని. పెద్దదాన్నాయె" అంటూ భోరున ఏడుస్తున్న నానమ్మను ఎలా సముదాయించాలో తెలియని ఆ పదేళ్ల కుర్రాడు ఆప్యాయంగా ఆమె గడ్డం పట్టుకుని-

"ఏడవకు నానమ్మా.. నేను పెద్దవాణ్ణయ్యాక మా అమ్మనీ నాన్నని కూడా ఇక్కడికే తెస్తాగా" అన్నాడు. చటుక్కున మనవడి నోటికి చేయి అడ్డుపెట్టింది. 'వద్దు వద్దు... ఇలాంటి పరిస్థితి రాబోయే తరాలవారెవ్వరూ ఎదుర్కోకూడదు. ఇది పునరావృతం కాకూడదు' స్వగతంలా అంటున్న ఆ మాటలు ఆ పసి హృదయానికి అర్థంకాక మౌనంగా చూస్తుండిపోయాడు.

★

